# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-04-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతి యుతంగా నిర్వహించడమే లక్ష్యంగా పని చేయాలని భారత ప్రధాన ఎన్నికల కమీషనర్ రాజీవ్ కుమార్ రాష్ట్ర ఎన్నికల అధికారులకు సూచించారు.**

**2. తెలంగాణాలో లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాదు సమీపంలోని తుక్కుగూడ గ్రామంలో "జన జాతర" పేరుతో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రేపు బహిరంగ సభ నిర్వహిస్తోంది.**

**3. ఆంధ్రప్రదేశ్‌లో బదిలీలు జరిగిన మూడు జిల్లాల కలెక్టర్లు.... అయిదు జిల్లాల పోలీసు సూపరింటెండెంట్‌ల స్థానంలో కేంద్ర ఎన్నికల సంఘం నూతన నియామకాలు చేపట్టింది.**

**4. స్వాతంత్ర్య సమర యోధులు, మాజీ ఉప ప్రధాన మంత్రి బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని ఈరోజు దేశవ్యాప్తంగా సమతా దివస్‌గా జరుపుకుంటున్నారు.**

**5. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రాగల 24 గంటల్లో పలు ప్రాంతాల్లో తీవ్ర వడగాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ తెలియజేసింది.**

==========================

త్వరలో జరగనున్నపార్లమెంట్,వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా శాంతి యుతంగా, హింసా రహితంగా నిర్వహించడానికి పని చేయాలని భారత ప్రధాన ఎన్నికల కమీషనర్ రాజీవ్ కుమార్ ఎన్నికల యంత్రాగానికి సూచించారు. ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై నిన్న ఢిల్లీ నుండి రాష్ట్రాల ఎన్నికల అధికారులు, ఇతర అధికారులతో ఆయన దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో నగదు, మద్యం,మాదక ద్రవ్యాలు వంటివి ఓటర్లను ప్రభావితం చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.ఈఏడాది జనవరి 1వ తేదీ నుండి ఇప్పటి వరకు 258 కోట్ల రూపాయలు విలువైన నగదు,మద్యం,మాదక ద్రవ్యాలు,ఇతర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

--------------------------

దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో ఎండల తీవ్రతను ఎదుర్కొనే విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్రాలను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సూచించింది. ఢిల్లీలో నిన్న జరిగిన ఉన్నతాధికార సమావేశంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ మన్ సుఖ్ మాండవీయ ఎండల తీవ్రతపై సమీక్షించారు. నీతి ఆయోగ్

అధికారులతో పాటు .... పలువురు వైద్య నిపుణులు ఈ సమావేశంలో పాల్గొని ఎండల పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రజల కోసం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. మంచినీటిని ఎక్కువగా తీసుకోవాలనీ, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్నం 12గంటల నుండి 4 గంటల మధ్య ప్రజలు... ప్రత్యేకించి వృద్ధులు,పిల్లలు ఇళ్లలోనే ఉండాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సూచించింది.

-------------------------

వేసవి దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌లో వివిధ తాగునీటి చెరువులను నింపేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత జిల్లాల కలక్టర్లు,ఇతర అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితులు,ఉపాధి హామీ పథకం పనులపై వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ తాగునీటి అవసరాల దృష్ట్యా నీటి నిల్వ ట్యాంకులను పూర్తిగా నీటితో నింపేందుకు ప్రకాశం బ్యారేజి నుండి ఏలూరు కాలువ,బందరు కాలువ,రైవస్ కాలువల ద్వారా ఎన్టిఆర్,కృష్ణా,ఏలూరు జిలాల్లకు,బకింగ్ హాం కాలువ ద్వారా గుంటూరు, బాపట్ల జిల్లాలకు రేపు నీటిని విడుదల చేస్తామని తెలిపారు. అలాగే నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ ద్వారా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు ఈనెల 8నుండి 18వ తేదీ వరకూ 10 రోజుల పాటు నీటిని విడుదల చేస్తామని జవహర్ రెడ్డి వివరించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న లోక్ సభ, శాసన సభ ఎన్నికలు రాష్ట్ర ప్రజల భవిష్యత్తును నిర్ణయిస్తాయని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై ఎస్ జగన్ మోహన రెడ్డి పేర్కొన్నారు. "మేమంతా సిద్ధం" పేరుతో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న బస్సు యాత్రలో భాగంగా నిన్న ఎనిమిదవ రోజున తిరుపతి జిల్లా నాయుడుపేట, చింతరెడ్డి పాలెం తదితర చోట్ల జరిగిన బహిరంగ సభలలో ఆయన మాట్లాడుతూ ..... తమ ప్రభుత్వం ప్రజల ఇళ్ళ ముంగిటికి సంక్షేమ పథకాలను చేర్చిందని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ లో అమలు చేసిన సంక్షేమ పథకాలను దేశంలో మరే రాష్ట్రం అమలు చేయలేదనీ, రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మందికి ఇళ్ళ పట్టాలను అందజేసామని తెలిపారు. వెనుకబడిన వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిచ్చిందని జగన్ మోహన రెడ్డి వివరించారు.

-------------------------

వై.ఎస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్ జగన్మోహన రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించింది.ఇలా ఉండగా... యాత్రకు ఈరోజు విరామం ప్రకటించారు. రేపు ఉదయం తిరిగి యాత్ర ప్రారంభం అవుతుందనీ, ఎల్లుండి సాయంత్రం కావలిలో బహిరంగ సభ నిర్వహిస్తారనీ పార్టీ వర్గాలు తెలియచేశాయి.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో బదిలీలు జరిగిన మూడు జిల్లాల కలెక్టర్లు .... అయిదు జిల్లాల పోలీసు సూపరింటెండెంట్ ల స్థానంలో కేంద్ర ఎన్నికల సంఘం నూతన నియామకాలు చేపట్టింది. ఈ అధికారులు తక్షణమే విధులలో చేరాలని ఆదేశించింది. కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన అధికారులలో కృష్ణా జిల్లా కలెక్టర్‌గా డి. కె.బాలాజీ, అనంతపురం జిల్లా కలెక్టర్‌గా వినోద్ కుమార్, తిరుపతి జిల్లా కలెక్టర్‌గా ప్రవీణ్ కుమార్, ప్రకాశం జిల్లా పోలీసు ఎస్పీ సూపరింటెండెంట్‌గా సుమిట్ సునీత్, పల్నాడు ఎస్.పి.గా బిందు మాధవ్ , చిత్తూరు ఎస్.పి.గా మణికంఠ చందోలు, అనంతపురం ఎస్.పి.గా అమిత్ బర్దర్, నెల్లూరు ఎస్.పి.గా అరిఫ్ హఫీజ్ , గుంటూరు ఐ.జి.గా సర్వ శ్రేష్ఠ త్రిపాఠి వున్నారు.

---------------------------

స్వాతంత్ర్య సమర యోధులు, మాజీ ఉప ప్రధాన మంత్రి బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని ఈరోజు దేశవ్యాప్తంగా "సమతా దివస్"గా జరుపుకుంటున్నాం. దేశ ప్రజలందరూ బాబూజీగా పిలుచుకునే జగ్జీవన్ రామ్ ప్రస్తుత బీహార్ రాష్ట్రంలోని చాంద్వా గ్రామంలో 1908 ఏప్రిల్ 5వ తేదీన జన్మించారు. విద్యాభ్యాసం అనంతరం స్వాతంత్రోద్యమంలో పాల్గొని పలుమార్లు జైలుకెళ్లారు. స్వాతంత్ర్యం అనంతరం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాన మంత్రిగా ఏర్పడిన జాతీయ ప్రభుత్వంలో ఆయన అతి చిన్న వయస్సులో కార్మికశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించి కార్మిక రంగానికి ఎనలేని సేవలు అందించారు. కమ్యూనికేషన్, రవాణా రైల్వే, ఆహార, వ్యవసాయ, రక్షణ, నీటి పారుదల శాఖల మంత్రిగా బాధ్యతలు పదవులు నిర్వహించి దేశానికి సేవలు అందించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అవనిగడ్డ , రైల్వే కోడూరు శాసన సభా స్థానాలకు జన సేన పార్టీ నిన్న అభ్యర్థులను ప్రకటించింది. జన సేన పార్టీ సీనియర్ నేతలతో ఆ పార్టీ అధ్యక్షులు కె. పవన్ కళ్యాణ్ చర్చించిన అనంతరం ఈ రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. అవనిగడ్డ శాసన సభా స్థానానికి మండలి బుద్ధ ప్రసాద్, రైల్వే కోడూరు స్థానానికి అరవ శ్రీధర్ పేరును ఖరారు చేసినట్టు జన సేన పార్టీ వర్గాలు తెలిపాయి.

---------------------------

తెలంగాణా లో లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాదు సమీపంలోని తుక్కుగూడ గ్రామంలో "జన జాతర " పేరుతో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రేపు బహిరంగ సభ నిర్వహిస్తోంది. అఖిల భారత కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, పార్టీ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ తదితరులు ఈ సభలో పాల్గొంటున్నారు. సభా నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిన్న హైదరాబాదులో జరిగిన సమావేశంలో సమీక్షించారు.

---------------------------

తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాలంటీరు వ్యవస్థను కొనసాగిస్తామని తెలుగు దేశం పార్టీ అధినేత ఎన్.చంద్ర బాబు నాయిడు వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో నిన్న నిర్వహించిన 'ప్రజాగళం' సభలో ఆయన ప్రసంగిస్తూ... వాలంటీరు వ్యవస్థకు తాము వ్యతిరేకం కాదనీ, కానీ ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వవద్దని కోరుతున్నామనీ అన్నారు. వాలంటీర్లు ప్రజలకు సేవ చేయాలనీ,పింఛను లబ్దిదారులు ఎండలో ఇబ్బందులు పడకుండా సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు నాయిడు కోరారు.

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రాగల 24 గంటల్లో పలు ప్రాంతాల్లో తీవ్ర వడగాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ తెలియజేసింది. ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు 109 మండలాల్లో తీవ్ర వడగాలులు, 206 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. రేపు 115 మండలాల్లో తీవ్ర వడగాలులు, 245 మండలాల్లో వడగాలులు వీస్తాయని పేర్కొంది. నిన్న నంద్యాల జిల్లా చాగలమర్రిలో 44.1, వైఎస్సార్ జిల్లా చిన్నచెప్పల్లిలో 43.9 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అటు తెలంగాణాలో ఈరోజు, రేపు వడగాలులు వీస్తాయని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నాం 3 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. అన్ని జిల్లాల్లో దాదాపు 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నల్గొండ జిల్లా నిడమనూరులో అత్యధికంగా 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మధ్యాహ్నాం వేళ వృద్ధులు, పిల్లలు బయటకు వెళ్ళరాదని వాతవరణ శాఖ సూచిస్తోంది.

=====================